# ఆ 1,563 మందికి మళ్లీ నీట్

మొదటిపేజీ తరువాయి...

టాపర్లుగా నిలిచిన సంగతి తెలిసిందే. దీంతో పరీక్ష ప్రశ్నాపత్రం లీకయ్యిందని, పరీక్షలో అక్రమాలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, పరీక్షా సమయం కోల్పోయిన విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడం వల్లనే ఎక్కువ మంది విద్యార్థులకు 100 శాతం మార్కులు వచ్చాయని ఇప్పటికే ఎన్టీఏ స్పష్టత ఇచ్చింది. ఈ అంశాన్ని గురువారం జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది.

**వీరి స్కోర్‌కార్డులు రద్దు చేస్తున్నాం**

నీట్ – యూజీ పరీక్షకు సంబంధించి నియమించిన కమిటీ సిఫార్సు మేరకు 1,563 మంది విద్యార్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులు ఉపసంహరించుకోవడంతో పాటు వారి స్కోర్ కార్డులను రద్దు చేస్తున్నట్టు కేంద్రం, ఎన్టీఏ తరఫున న్యాయవాది కను అగర్వాల్ కోర్టుకు తెలిపారు. గ్రేస్ మార్కులు లేకుండా వీరికి వచ్చిన అసలైన మార్కులను తెలియజేస్తామని చెప్పారు. వీరి కోసం జూన్ 23న మళ్లీ పరీక్ష నిర్వహించి 30న ఫలితాలు ఇస్తామని తెలిపారు. ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులకు అందులో వచ్చిన మార్కులనే తుది మార్కులుగా పరిగణనలోకి తీసుకుంటామని, మరోసారి పరీక్ష రాయని విద్యార్థులకు గ్రేస్ మార్కులు లేకుండా ఇచ్చే మార్కులను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. జూలై 6న యథావిధిగా అందరికీ కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. కేంద్రం, ఎన్టీఏ నిర్ణయాన్ని ధర్మాసనం సమర్థించింది. అయితే, ఈ 1,563 మందికే కాకుండా పరీక్షా సమయం కోల్పోయినప్పటికీ కోర్టును ఆశ్రయించని అందరికీ మళ్లీ పరీక్ష నిర్వహించాలని 'ఫిజిక్స్




వాలా' నిర్వాహకుడు అలఖ్ పాండే తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది.

**61కి తగ్గిన టాపర్లు**

గ్రేస్ మార్కులు తీసేయడంతో నీట్–యూజీ టాపర్ల సంఖ్య 67 నుంచి 61కి తగ్గింది. మొదట విడుదల చేసిన ఫలితాల్లో 67 మంది 720కి 720 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. గ్రేస్ మార్కులు కలిసిన 1,563 మందిలో టాపర్లు ఆరుగురు ఉన్నారు. కాగా, 1,563 మందిలో ఎంత మంది మళ్లీ పరీక్ష రాసేందుకు అంగీకరిస్తారో తేలిన తర్వాత కొత్త ర్యాంక్ లిస్టును విడుదల చేస్తామని ఎన్టీఏ తెలిపింది.

**'పేపర్ లీక్'కు ఆధారాలు లేవు: ప్రధాన్**

నీట్ – యూజీ పేపర్ లీక్ అయిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపైన వచ్చిన అవినీతి ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. ఎన్టీఏ చాలా విశ్వసనీయమైన సంస్థ అని కితాబిచ్చారు. ఉన్నత విద్య స్థాయిలోనే కాకుండా ప్రతియేటా 50 లక్షల మంది స్కూల్ విద్యార్థులకు ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. 1,563 మంది విద్యార్థులకు సుప్రీంకోర్టు ఫార్ములా ఆధారంగానే ఎన్టీఏ ఇచ్చిందని స్పష్టం చేశారు.

**నీట్‌ను రద్దు చేయాలి: తమిళనాడు**

నీట్–యూజీ పరీక్షలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కేంద్రం, ఎన్టీఏ తీరును తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా విమర్శించింది. ఈ అక్రమాలకు, గందరగోళానికి ఎన్టీఏదే పూర్తి బాధ్యత అని తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి మా సుబ్రమణియన్ ఆరోపించారు. అసలు ఏ ప్రాతిపదికన గ్రేస్ మార్కులు వేశారని, ఈ నిర్ణయాన్ని నీట్ అభ్యర్థులకు చెప్పారా? అని ప్రశ్నించారు. నీట్‌ను రద్దు చేయాలని తమ సీఎం ఇన్ని రోజులుగా చేస్తున్న డిమాండ్ ఇప్పుడు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నదని, కేంద్రం ఇప్పటికైన నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**మోదీ ప్రభుత్వం తప్పించుకోలేదు: ఖర్గే**

నీట్ పరీక్షకు సంబంధించి గ్రేస్ మార్కులు మాత్రమే సమస్య కాదని, పరీక్షలో అక్రమాలు జరిగాయని, పేపర్ లీక్ అయ్యిందని, అవినీతి చోటుచేసుకుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని ఎన్టీఏపై నెట్టేసి మోదీ ప్రభుత్వం తప్పించుకోలేదని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి శంతను సేన్ డిమాండ్ చేశారు. కాగా, నీట్‌లో అక్రమాలకు వ్యతిరేకంగా కోల్‌కతా సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు.

## పరీక్షలో అవకతవకలు

హైదరాబాద్, జూన్13 (నమస్తే తెలంగాణ): నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని, మళ్లీ పరీక్ష నిర్వహించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ ద్వారా 15శాతం మెడికల్ సీట్లు జాతీయ కోటాలో చేరుతున్నందున తెలంగాణ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు.

## హీరో దర్శన్ సమక్షంలోనే హత్య

- ముగ్గురికి 15 లక్షల సుపారీ
- ప్రత్యక్షంగా పాల్గొన్న 8 మంది




బెంగళూరు, జూన్ 13: హత్య కేసులో అరెస్టయిన కన్నడ హీరో దర్శన్ తూగుదీప ఉదంతంలో షాకింగ్ నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. తన ప్రియురాలు పవిత్రాగౌడ్‌ను సామాజిక మాధ్యమంలో వేధించాడన్న కోపంతో రేణుకాస్వామి అనే వ్యక్తిని తన అభిమాన సంఘాల సభ్యులకు సుపారీ ఇచ్చి హత్య చేసినట్టు ఆయనపై ప్రధాన ఆరోపణ. దీంతో ఈ కేసులో దర్శన్, పవిత్రాగౌడ్ సహా 15 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ హత్య చేయడానికి దర్శన్ ముగ్గురికి 15 లక్షల రూపాయలు సుపారీ ఇచ్చినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీస్ వర్గాలు తెలిపిన వివరాలు ప్రకారం.. హత్య విషయంలో తన పేరు బయటకు రాకూడదని, తామే హత్య చేసినట్టు పోలీసులకు చెప్పాలని, వారికి అయ్యే కోర్టు ఖర్చులు తానే భరిస్తానని దర్శన్ వారికి చెప్పారు.

**కర్రలతో చితకబాదిన దర్శన్**

రేణుకాస్వామిని ఈ నెల 8న వారు ఒక షెడ్‌లో బంధించిన తర్వాత అతడిని దర్శన్, అనుచరులు కలిసి కర్రలతో కొట్టి చంపారు. ఈ హత్యలో 8 మంది ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అనంతరం అతడి శవాన్ని బెంగళూరులోని కామాక్షిపాల్య కెనాల్‌లోకి దర్శన్ సమక్షంలోనే విసిరేశారు. దీనిపై రేణుకాస్వామి భార్య మాట్లాడుతూ పవిత్రాగౌడ్‌ను తన భర్త సామాజిక మాధ్యమంలో వేధించాడనడం అబద్ధమని అన్నారు. తన భర్తను హత్య చేసిన వ్యక్తి నటుడైనా, స్టారయినా అతనిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. కాగా, ఈ కేసులో తాజాగా దర్శన్ సహ నటుడు ప్రదోశ్, నాగరాజులను కూడా అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## అవినీతిపై నిరాహార దీక్ష చేస్తూ మృతి

మథుర, జూన్ 13: అవినీతికి వ్యతిరేకంగా నాలుగు నెలలుగా నిరాహారదీక్ష చేస్తున్న ఓ సామాజిక కార్యకర్త తుదిశ్వాస విడిచారు. ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లా దవాఖానలో మృతి చెందినట్టు అధికారులు గురువారం వెల్లడించారు. మాంట్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) ఆదేశ్‌కుమార్ వివరాల ప్రకారం.. జిల్లాలో అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందని దేవకీనందశర్మ (66) గతంలో గ్రామీణాభివృద్ధి శాఖకు ఫిర్యాదు చేయగా విచారణ జరిపారు. కానీ, వారిచ్చిన నివేదికను శర్మ వ్యతిరేకించారు. అవినీతికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12 నుంచి ఒక ఆలయం వెలుపల నిరాహార దీక్షకు కూర్చున్నారు. శర్మ ఆరోగ్యం క్షీణించడంతో దవాఖానకు తరలించగా గురువారం తుదిశ్వాస విడిచారు. 'నేను సోమవారం శర్మను కలిశాను. అవినీతి విషయంపై ఉన్నతాధికారులకు వివరించినందున నిరాహార దీక్ష విరమించాలని అభ్యర్థించాను. కానీ, ఆయన రాతపూర్వక హామీ కోసం పట్టుబట్టారు. అలా రాసి ఇవ్వడం నా అధికార పరిధిలో లేదు అని చెప్పాను' అని ఎస్‌డీఎం ఆదేశ్‌కుమార్ వివరించారు.

## యెడియూరప్పపై అరెస్ట్ వారెంట్

బెంగళూరు, జూన్ 13: పోక్సో కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత యెడియూరప్పపై గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. ఈ కేసులో అవసరమనుకుంటే మాజీ సీఎంను అరెస్ట్ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. తన 17 ఏండ్ల కుమార్తెను ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన ఇంట్లోనే లైంగికంగా వేధించినట్టు ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై యెడియూరప్పపై పోక్సో చట్టం కింద సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది. కాగా, 54 ఏండ్ల ఆ మహిళ ఇటీవలే అనారోగ్యంతో మరణించింది. ఈ కేసులో యెడియూరప్పకు సీఐడీ సమన్లు జారీ చేయగా, కొంతకాలం వ్యవధి కావాలంటూ ఆయన కోరారు. అయితే, గురువారం బెంగళూరు కోర్టు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.ఈ కేసులో అవసరమనుకుంటే యెడియూరప్పను సీఐడీ అరెస్ట్ చేస్తుందని కర్ణాటక హోం మంత్రి జీ పరమేశ్వర తెలిపారు. కేసు దర్యాప్తు అంతా క్రమపద్ధతిలోనే జరుగుతున్నదని ఈ నెల 15న సీఐడీ చార్జిషీట్ దాఖలు చేస్తుందని చెప్పారు.

## జాతీయ భద్రతా సలహాదారుగా మళ్లీ అజిత్ దోవల్

- ప్రధాని ముఖ్య కార్యదర్శిగా పీకే మిశ్రా



న్యూఢిల్లీ, జూన్ 13: కొత్త ప్రభుత్వంలోనూ కీలక శాఖలను మళ్లీ పాత మంత్రులకే కేటాయించిన ప్రభుత్వం అధికారుల విషయంలోనూ అదే వైఖరిని అవలంబిస్తున్నది. అజిత్ దోవల్, పీకే మిశ్రా, అమిత్ ఖరే, తరుణ్ కపూర్ లాంటి కీలక ఉన్నతాధికారులను వారి పదవుల్లోనే కొనసాగిస్తున్నది. విశ్రాంత ఐపీఎస్ అధికారి అజిత్ దోవల్‌ను జాతీయ భద్రతా సలహాదారుగా మూడోసారి నియమించింది. జూన్ 10 నుంచే ఈ నియామకం అమలులోకి వస్తుందని ప్రభుత్వం పేర్కొన్నది. ఈ పదవిలో అజిత్ దోవల్‌కు క్యాబినెట్ మంత్రి హోదా ఉండనుంది. ఇక, ప్రధాని మోదీ ముఖ్య కార్యదర్శిగా ఉన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి పీకే మిశ్రాను మళ్లీ ఇదే పదవిలో నియమించింది. ఈ పదవుల్లో వీరు ప్రధానమంత్రి పదవీకాలం పూర్తయ్యే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కొనసాగనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నది. మరోవైపు మాజీ ఐఏఎస్ అధికారులు అమిత్ ఖరే, తరుణ్ కపూర్‌ను కూడా ప్రధానమంత్రి సలహాదారులుగా మళ్లీ నియమించింది.

## పెమా ఖండూ.. వరుసగా మూడోసారి

**అరుణాచల్ సీఎంగా ప్రమాణస్వీకారం**



ఇటానగర్, జూన్ 13: అరుణాచల్ ప్రదేశ్ సీఎంగా బీజేపీ నాయకుడు పెమా ఖండూ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర సీఎంగా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడం వరుసగా ఇది మూడోసారి. 11 మంది మంత్రులతో ఏర్పాటుచేసిన రాష్ట్ర క్యాబినెట్‌లో దసాంగ్లు పుల్ ఏకైక మహిళా మంత్రిగా ఉన్నారు. ముగ్గురు సిట్టింగ్ మంత్రులకు తాజా క్యాబినెట్‌లో చోటుదక్కక పోవటం గమనార్హం. రాజధాని ఇటానగర్‌లో రాష్ట్ర గవర్నర్ కేటీ పర్నాయక్ చేతులమీదుగా జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అస్సాం, సిక్కిం సీఎంలు హిమంత బిశ్వశర్మ, ప్రేమ్‌సింగ్ తమాంగ్ తదితరులు హాజరయ్యారు. 60 అసెంబ్లీ స్థానాలున్న అరుణాచల్ ప్రదేశ్‌లో బీజేపీ 46 స్థానాల్ని కైవసం చేసుకుంది.

# 'మహా' కూటముల్లో మంటలు

- బీజేపీ తీరుపై శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్ వర్గం) రుసరుస
- కేంద్ర మంత్రి పదవుల కేటాయింపుపై అసంతృప్తి
- ఠాక్రే శివసేన - కాంగ్రెస్ మధ్య ఎమ్మెల్సీ ఎన్నికల చిచ్చు



ముంబై: లోక్‌సభ ఎన్నికల ముందు వరకు స్నేహగీతం పాడిన మహారాష్ట్ర పార్టీలు ఇప్పుడు అసమ్మతి గళం వినిపిస్తున్నాయి. అటు మహాయుతి(ఎన్డీయే)లో, ఇటు మహా వికాస్ అఘాడీ(ఇండియా కూటమి)లో విభేదాలు మొదలయ్యాయి. కేంద్ర మంత్రి పదవుల కేటాయింపు మహాయుతిలో చిచ్చు పెట్టగా, ఎమ్మెల్సీ ఎన్నికల సీట్ల పంపకం మహావికాస్ అఘాడీలో మంటలు రాజేసింది. దీంతో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

**మంత్రి పదవులపై అసంతృప్తి**

మహారాష్ట్రలో ఆశించిన లోక్‌సభ స్థానాలు దక్కకపోవడంతో మహాయుతి కూటమిలో విభేదాలు మొదలయ్యాయి. ఓటమికి మీరంటే మీరే కారణమంటూ పరస్పరం నిందలు వేసుకుంటున్నారు. పోటీ చేసిన నాలుగు స్థానాల్లో మూడింట ఎన్సీపీ(అజిత్ పవార్)వర్గం ఓడిపోయింది. బీజేపీ సరిగ్గా పని చేయకపోవడమే ఇందుకు కారణమని అజిత్ పవార్ ఆరోపించారు. రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు వ్యాఖ్యానించడం తమకు నష్టం చేసిందని బాహాటంగానే చెప్పారు. పైగా ఎన్సీపీకి కేంద్ర క్యాబినెట్‌లో చోటు దక్కలేదు. ఆ పార్టీ సీనియర్ నేత ప్రఫుల్ పటేల్‌కు సహాయ మంత్రి పదవి ఇస్తామని బీజేపీ చెప్పగా ఎన్సీపీ తిరస్కరించింది. మరోవైపు ఒకే ఒక్క సహాయ మంత్రి పదవి ఇవ్వడం పట్ల శివసేన(ఏక్‌నాథ్ షిండే) వర్గం బీజేపీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నది. బీజేపీ కంటే తామే మంచి ఫలితాలు సాధించామని, తాము 15 సీట్లలో పోటీ చేసి ఏడు గెలిస్తే, బీజేపీ 28 పోటీ చేసి కేవలం 9 మాత్రమే గెలిచిందని ఆ పార్టీ చీఫ్ విప్ శ్రీరంగ్ బర్నే అన్నారు. తక్కువ సీట్లు వచ్చిన పార్టీలకు మంత్రి పదవులు దక్కాయనడం ఎన్డీయేలో అసంతృప్తిని బయటపెట్టింది.

**సీట్ల పంపకంలో లొల్లి**

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన ఎంవీఏలోనూ విభేదాలు మొదలయ్యాయి. శాసనమండలి ఎన్నికలు కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) మధ్య చిచ్చు రేపాయి. ప్రస్తుతం నాలుగు పట్టభద్రులు, ఉపాధ్యాయ కోటా శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో రెండు స్థానాలకు తాము పోటీ చేసి, మరో రెండింటిని శివసేన(ఉద్ధవ్ ఠాక్రే)కు వదిలేయాలని కాంగ్రెస్ భావించింది. అయితే, ఉద్ధవ్ ఠాక్రే మొత్తం నాలుగు స్థానాలకు తామే పోటీ చేస్తామని ప్రకటించారు. దీనిని పీసీసీ చీఫ్ నానా పటోలే తప్పుపట్టారు. తమను సంప్రదించకుండానే ఠాక్రే ఈ ప్రకటన చేశారని ఆరోపించారు. తర్వాత కూడా దీనిపై స్పందించడం లేదని పేర్కొన్నారు. దీంతో రెండు పార్టీల మధ్య విభేదాలు బయటపడ్డాయి.

## లోక్‌సభ స్పీకర్ పదవి బీజేపీకే!

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ స్థానాన్ని మిత్రపక్షాలకు కేటాయిస్తారన్న వార్తలకు బీజేపీ తెరదించింది. ఆ పదవిని తమ పార్టీయే అట్టిపెట్టుకుంటుందని, మూడోసారి కూడా తమ వారే ఆ పదవిని అధిష్ఠిస్తారని ఆ పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ పదవిని సంకీర్ణ పార్టీల వారు అడిగారంటూ మీడియాలో వస్తున్న వార్తలను బీజేపీ సీనియర్ నేత ఒకరు ఖండించారు. అయితే వారితో చర్చలు జరిపిన అనంతరం ఏకాభిప్రాయ సాధనతోనే తాము ఈ పదవిని చేపడతామని ఆయన చెప్పారు. ప్రధాని మోదీ ఇటలీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత స్పీకర్ పేరును ప్రకటిస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

## 26న స్పీకర్ ఎన్నిక

న్యూఢిల్లీ: కొత్త లోక్‌సభ ఈ నెల 26న స్పీకర్‌ను ఎన్నుకుంటుంది. ఆ పదవికి అభ్యర్థులకు మద్దతు తెలిపే తీర్మానాల నోటీసులను 25న మధ్యాహ్నం 12 గంటల్లోగా అందించాలని లోక్‌సభ సచివాలయం గురువారం తెలిపింది. లోక్‌సభ సమావేశాలు 24న ప్రారంభమై జూలై 3న ముగుస్తాయి.



# గ్యారెంటీలకు మంగళం!

- అమలుపై పునరాలోచించాలని కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్
- లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 9 సీట్లే గెలవడంతో గ్యారెంటీలపై యూటర్న్

*బెంగళూరు, జూన్ 13: ఐదు గ్యారెంటీలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కర్ణాటక కాంగ్రెస్ ఇప్పుడు పునరాలోచనలో పడింది. ఈ గ్యారెంటీలు రాష్ట్రంలో అధికారాన్ని ఇచ్చినా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఓట్లు రాల్చలేదు. గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తున్నామని, లబ్ధిదారులు తమనే గెలిపిస్తారని కర్ణాటక కాంగ్రెస్ నేతలు నమ్మారు. అయితే, రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు కేవలం తొమ్మిది మాత్రమే దక్కాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 19 సీట్లు దక్కించుకుంది. ఊహించని ఈ ఫలితం కన్నడ కాంగ్రెస్ నేతలకు షాకిచ్చింది. ఐదు గ్యారెంటీలపై పెట్టుకున్న ఆశలు నెరవేరకపోవడంతో ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. నిధులన్నీ గ్యారెంటీల అమలుకే ఖర్చు అవుతున్నాయని, ఫలితంగా అభివృద్ధి జరగడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఒకవైపు అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని, మరోవైపు గ్యారెంటీలు అందుకున్న లబ్ధిదారులు ఓట్లు వేయడం లేదని వాపోతున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఐదు గ్యారెంటీలపై పునరాలోచన చేయాలని కోరుతున్నారు.*

***గ్యారెంటీలకు ముగింపు ?***

*మొదట బాగల్‌కోట్ ఎమ్మెల్యే జేటీ పాటిల్ ఈ వాదనను తెరపైకి తీసుకురాగా మరో ముగ్గురు ఎమ్మెల్యేలు సైతం సమర్థించారు. గ్యారెంటీల వల్ల జనం సోమరులుగా మారుతున్నారని బీజేపీ పదే పదే చెప్పిన మాటలనే జనం సమర్థించారని, గ్యారెంటీలను ఇష్టపడటం లేదని కాంగ్రెస్ నేత లక్ష్మణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలే ఈ వ్యాఖ్యలు చేయడం చూస్తుంటే ఇక గ్యారెంటీలకు ముగింపు పలికేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్నట్టే కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లేదంటే పథకాలు పొందుతూ తమకు ఓట్లు వేయలేదని ప్రజలపై పరోక్షంగా ఆగ్రహాన్ని చూపిస్తున్నట్టు అనిపిస్తున్నదని విశ్లేషిస్తున్నారు.*


# ఫోన్ నంబరుకూ ఫీజు!

- నంబర్లు 'పరిమితమైన వనరులు'
- వీటి చార్జీలు వసూలు చేయాలి
- వినియోగించని నంబర్లపై జరిమానా విధింపు
- ట్రాయ్ కొత్త ప్రతిపాదనలు


న్యూఢిల్లీ, జూన్ 13: మొబైల్, ల్యాండ్‌లైన్ వినియోగదారులకు త్వరలోనే షాక్ తగిలే అవకాశం ఉంది. ఫోన్ నంబరు కలిగి ఉన్నందుకు కూడా ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి రాబోతున్నది. ఈ మేరకు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) కొత్త ప్రతిపాదనలు చేసింది. మొబైల్, ల్యాండ్‌లైన్ నంబర్లు కూడా పరిమితమైన, విలువైన ప్రజా వనరులేనని, కాబట్టి వీటిపై ఫీజు వసూలు చేయాలని ట్రాయ్ భావిస్తున్నది. ఈ మేరకు జూన్ 6న విడుదల చేసిన ప్రతిపాదన పత్రంలో ఈ ఫీజుల ప్రతిపాదనను పొందుపరిచింది. అయితే, టెలికం ఆపరేటర్ల నుంచి ఈ ఫీజులు వసూలు చేయాలని ట్రాయ్ భావిస్తున్నది. టెలికం ఆపరేటర్లు ఈ భారాన్ని వినియోగదారులపైనే మోపుతారు. నంబర్లకు ఫీజులు విధించడం ద్వారా ఈ పరిమితమైన వనరులను సక్రమంగా కేటాయించే అవకాశం ఉంటుందని ట్రాయ్ చెప్తున్నది. గత ఏడాది డిసెంబరులో ఆమోదం పొందిన కొత్త టెలికం చట్టం సైతం ఫోన్ నంబర్లపై చార్జీలు వసూలు చేసేందుకు అనుమతిస్తున్నది. ఎలాగైతే స్పెక్ట్రమ్‌ను ప్రభుత్వం కేటాయిస్తుందో అలాగే నంబరింగ్ స్పేస్‌పై కూడా యాజమాన్య హక్కు ప్రభుత్వానికి ఉంటుందని ట్రాయ్ చెప్తున్నది.

**వినియోగంలో లేని నంబర్లపై ఆపరేటర్లకు జరిమానా**

ఫోన్ నంబర్లకు ఫీజు వసూలు చేసేందుకు పలు పద్ధతులను ట్రాయ్ సూచించింది. ఒకేసారి ఒక్కో నంబరుపై కొంత మొత్తం ఛార్జీ వసూలు చేయడం, ఏటా కొంత ఫీజు తీసుకోవడం, ప్రీమియం, వీఐపీ నంబర్లకు మాత్రమే కేంద్రీకృత వేలం నిర్వహించడం వంటి మార్గాల్లో ఏదో ఒకటి అవలంబించొచ్చని ట్రాయ్ పేర్కొన్నది. ఇప్పటికే ఆస్ట్రేలియా, సింగపూర్, బెల్జియం, యూకే, ఫిన్లాండ్, హాంకాంగ్, కువైట్, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా, డెన్మార్క్ తదితర దేశాల్లో ఫోన్ నంబర్లపై ఫీజులు వసూలు చేసే విధానం ఉంది. కాగా, వినియోగంలో లేని నంబర్లపై టెలికం ఆపరేటర్లకు జరిమానా విధించే అంశాన్ని కూడా ట్రాయ్ పరిశీలిస్తున్నది. నంబర్లు కొన్ని నెలల పాటు వినియోగంలో లేకపోయినప్పటికీ వినియోగదారులను కోల్పోకుండా ఉండేందుకు ఆ నంబర్లను టెలికం ఆపరేటర్లు రద్దు చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఫోన్ నంబర్లు నిరుపయోగంగా మారుతున్నందున వీటిపై టెలికం ఆపరేటర్లకు జరిమానా విధించే ఆలోచనతో ట్రాయ్ ఉంది. వీటితో పాటు



మొబైల్ కంట్రీ కోడ్‌లు(ఎంసీసీ), మొబైల్ నెట్‌వర్క్ కోడ్‌లు(ఎంఎన్‌సీ) కేటాయించడంపై కూడా ట్రాయ్ దృష్టి సారించింది. ఈ ప్రతిపాదనలపై అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా భాగస్వామ్యపక్షాలకు ట్రాయ్ జూలై వరకు అవకాశం ఇచ్చింది.



## భూమిపై మనుషుల రూపంలో ఏలియన్లు!

న్యూయార్క్, జూన్ 13: ఏలియన్లు ఉన్నారా? ఉంటే ఎక్కడున్నారు? భూమిపైకి వస్తున్నారా? ఎవరితో సంబంధం కలిగి ఉన్నారు? అన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం దొరకటం లేదు. అయితే, ఏలియన్లు భూమ్మీద నివసిస్తున్నారేమోనని శాస్త్రవేత్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మనుషుల్లా వేషధారణ మార్చుకొని భూమిపై మనుగడ సాగిస్తుండొచ్చని హార్వర్డ్ వర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం వెల్లడించింది. యూఎఫ్‌వోలు అనేవి భూమిపై ఉన్న ఏలియన్ స్నేహితులను కలిసేందుకు గ్రహాంతరవాసులు వినియోగించే స్పేస్‌షిప్‌లు అయ్యుండొచ్చని వారు అంచనా వేశారు.

## ఐస్‌క్రీమ్‌లో మనిషి బొటనవేలు

ముంబై, జూన్ 13: ఆన్‌లైన్‌లో కోన్ ఐస్‌క్రీమ్ ఆర్డర్ చేసిన ఓ వైద్యుడికి భయానక అనుభవం ఎదురైంది. ముంబైలో మలద్ ప్రాంతానికి చెందిన బ్రెండన్ ఫిర్రావ్(26) బుధవారం మధ్యాహ్నం ఆన్‌లైన్‌లో యమ్మో కంపెనీకి చెందిన కోన్ ఐస్‌క్రీమ్ ఆర్డర్ చేశాడు. దీనిని తెరిచి తింటుండగా గట్టిగా ఉన్న ఒక పదార్థం నోట్లోకి వచ్చింది. మొదట ఇది ఐస్‌క్రీమ్‌లో ఉండే డ్రైఫ్రూట్స్‌కు చెందిన ఏదైనా పలుకు అని భావించాడు. కానీ, అనుమానించి బయటకు ఊసి చూడగా గోరుతో ఉన్న చిన్న మాంసపు ముక్క కనిపించింది. ఇది చూడగానే ఫిర్రావ్ భయాందోళనకు గురయ్యాడు. వైద్యుడైన అతడు ఈ మాంసపు ముక్క మనిషి బొటనవేలిగా గుర్తించి షాక్ తిన్నాడు. ఈ విషయమై కంపెనీకి ఇన్‌స్టాగ్రామ్‌లో ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీంతో ఈ మాంసపు ముక్కను ఒక ఐస్ బ్యాగ్‌లో వేసుకొని మలద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పెంపు

న్యూఢిల్లీ, జూన్ 13: ఆధార్‌ను ఉచితంగా అప్‌డేట్ చేసుకొనే గడువును కేంద్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. గతంలో నిర్ణయించిన ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో గడువు తేదీని ఈ ఏడాది సెప్టెంబర్ 14 వరకు పొడిగించింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఉడాయ్) వెబ్‌సైట్ ఈ విషయాన్ని వెల్లడించింది.

## జీ7 సదస్సుకు మోదీ

న్యూఢిల్లీ: జీ7 సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ గురువారం ఇటలీ వెళ్లారు. ఈ సదస్సులో భారత్ ప్రధానంగా కృత్రిమ మేధ (ఏఐ), ఎనర్జీ, ఆఫ్రికా, మెడిటెర్రేనియన్‌పై దృష్టి సారిస్తుందని మోదీ చెప్పారు. ఆయన మూడోసారి పీఎం పదవిని చేపట్టిన తర్వాత ఇదే తొలి విదేశీ పర్యటన. జీ7 సదస్సు ఈ నెల 13 నుంచి 15 వరకు జరుగుతుంది. మోదీ శుక్రవారం ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతోపాటు, వివిధ దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో కూడా ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది.

## త్వరలో ఏటీఎం చార్జీల పెంపు?

న్యూఢిల్లీ, జూన్ 13: ప్రస్తుతం వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ఏటీఎం చార్జీలు పెంచుతారా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. ప్రస్తుతం ఉన్న ఇంటర్‌ఛేంజ్ ఫీజు పెంచాలని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ (సీఏటీఎంఐ) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేసింది. కనీసం 23 రూపాయలకు పెంచాలని కోరింది. కాగా, ఒక బ్యాంక్‌కు సంబంధించిన ఏటీఎం కార్డును మరో బ్యాంక్ ఏటీఎంలో వినియోగించడాన్నే ఇంటర్‌ఛేంజ్ అంటారు. ప్రస్తుతం 21 ఉండగా, దానిని 23 రూపాయలు చేయాలంటూ ఏటీఎం నిర్వహణ సంస్థ అడుగుతున్నది.

## జోషిమఠ్ ఇకపై జ్యోతిర్మఠ్

డెహ్రాడూన్, జూన్ 13: పురాణేతిహాసాల్లో ప్రసిద్ధిగాంచిన ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ పేరు మారింది. ఇక నుంచి దానిని అధికారికంగా జ్యోతిర్మఠ్‌గా వ్యవహరిస్తారు. పేరు మార్పునకు కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోద ముద్ర వేసిందని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాది జరిగిన ఒక ఉత్సవంలో జోషిమఠ్ పేరును మార్చాలని స్థానికులు, పలు సంస్థలు విజ్ఞప్తి చేశాయి. బద్రీనాథ్ యాత్రికులకు ముఖద్వారంగా ఉన్న జోషిమఠ్‌లో ఆదిగురు శంకరాచార్య స్థాపించిన మఠాలలో కూడా ఒకటి.

## గత ఏడాది కంటే అధిక వీసాలు: అమెరికా

న్యూఢిల్లీ, జూన్ 13: గత ఏడాది రికార్డుస్థాయిలో 1,40,000 స్టూడెంట్ వీసాలను జారీ చేసిన అమెరికా.. ఈ సారి అంతకంటే ఎక్కువ వీసాలను జారీచేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఆ దేశ ఎంబసీ అధికారులు వెల్లడించారు. గత ఏడాది రికార్డును ఈ ఏడాది అధిగమించవచ్చునని వారు తెలిపారు. విద్యార్థుల 8వ వార్షిక వీసా డేను పురస్కరించుకుని భారత్‌లోని ఢిల్లీ, హైదరాబాద్ సహా పలు కాన్సులర్ కార్యాలయాల్లో గురువారం సుమారు 4 వేల మందికి వీసా ఇంటర్వ్యూలను నిర్వహించారు. గత ఏడాది స్థాయిలోనో లేదా అంతకన్నా ఎక్కువగానో వీసాల జారీ ఉండవచ్చునని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

## మస్క్‌పై మాజీ ఉద్యోగినుల దావా

వాషింగ్టన్: లైంగిక వేధింపుల ఆరోపణలు బిలియనీర్ ఎలాన్ మస్క్‌ను, ఆయన కంపెనీ 'స్పేస్ ఎక్స్'ను వెంటాడుతున్నాయి. తాజాగా 8 మంది మాజీ మహిళా ఉద్యోగులు స్పేస్ ఎక్స్, మస్క్‌కు వ్యతిరేకంగా కోర్టులో దావా వేశారు. వ్యక్తిగతంగా తమపై కక్షగట్టి ఉద్యోగంలో నుంచి తొలగించే ఉత్తర్వులు మస్క్ ఇచ్చాడని దావాలో వారు ఆరోపించారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయగానే, తమను ఉద్యోగంలో నుంచి తొలగించారని పేర్కొన్నారు. మహిళల్ని లైంగిక వస్తువులుగా మస్క్ పరిగణిస్తున్నాడని, పని ప్రదేశంలో నెలకొన్న వాతావరణాన్ని ఎవరైనా సవాల్ చేస్తే ఉద్యోగాన్ని కోల్పోవాల్సి వచ్చేదని వారు ఆరోపించారు.